
## ఊహల్లో విహరించే భర్తకి ఆమె వాస్తవాన్ని ఎలా గుర్తు చేసింది?

# గుండె గుసగుస





అల్లంత దూరంలో సుబ్బలక్ష్మి కనిపించేసరికి శివానందం మొహం ఏనుగు చెవ్వంత అయింది. ఎండ పొడ సోకిన స్టెయిన్‌లెస్ స్టీలు కంచంలా వెలిగిపోయింది. రెండు చేతుల్తోనూ రెండు బరువైన సంచులు మోసుకుంటూ నెమ్మదిగా వచ్చింది సుబ్బలక్ష్మి. వీధి వరండాలో గోడకి చేరబడి కూచున్న శివానందాన్ని చూసి చిరునవ్వు నవ్వింది పలకరింపుగా.

''ఎంతసేపైంది మావయ్యా, వచ్చి?'' అనడిగింది.

రోగిష్టి గేదెదూడల కడుపుల్లా వున్న సంచుల్ని కోడలినుంచి అందుకుంటూ ''అర్ధగంట దరిదాపే అవుతోంది సుబ్బులూ! ఆదివారమేగదా, కొంపలోనే వుంటారని ఎనిమిది గంటల బస్సుకి బయల్దేరా! దిక్కుమాలిన బస్సు! మూడు గంటల ప్రయాణాన్ని నాలుగ్గంటలదాకా దేకించింది. పేరుకి సూపర్‌డీలక్స్! పాత ఇత్తడి గిన్నెకి మాటు వేసి తారుపూసినట్టు, నా పుటకలనాటి బస్సుకి రంగులేసి లైన్లో పెట్టినట్టున్నారు. ఒకటే ఊగుడు! పైపెచ్చు ఏకకాలంలో వంద డబ్బాలు మోగించినట్టు మోడ్రన్ మ్యూజిక్కు! ఒళ్లు హూనమైపోయిందనుకో! తీరా వచ్చేసరికి తలుపులకి పాత్రంలాంటి తాళం! పైప్రాణం పైనే పోయిందనుకో!'' అని శివానందం తన ఫీలింగ్స్‌ని కొంచెం విపులంగానే వర్ణించాడు.

సుబ్బలక్ష్మి తాళం తీసింది. ఇద్దరూ లోనికి నడిచారు. శివానందం, అక్కడే ఉన్న పడక్కుర్చీలో వాలేడు, సంచుల్ని కోడలికి అందించి.

''ఇంట్లో కూరల్లేవు! సామానన్లా నిండుకున్నాయి. చెప్పి చెప్పి నా నోరు పడిపోయిందిగాని, ఆయనగారు పట్టించుకోలేదు రండి! ఈ లోగా కాఫీ తెస్తాను'' అంది సుబ్బలక్ష్మి వంటింటివైపు కదుల్తూ.



''అదంతా సరేనమ్మా! మా ఘటం ఏదీ?'' అడిగాడు శివానందం.

''ఆయనేదో రచయితల సమావేశం అంటూ తెల్లవారకుండానే గుమ్మం దాటారు మావయ్యా!''

''ఏవిటది! రచయితల సమావేశమా? దాంతో వీడికేం పని? వీడు రచయిత ఎప్పుడయ్యాడు? నాకు తెలిసినంతవరకు

తట్టలకొద్దీ కాగితాలు నలుపుచెయ్యడం, ఉండలు చుట్టి కొంపనిండా పోగులు పొయ్యడం జరిగిందంతే! ఒక్క కథకూడా అచ్చయి చావలా! తగుదునమ్మా అని వీడెందుకు అక్కడికి, సిగ్గులేక?''

సుబ్బలక్ష్మి సమాధానంగా చిరునవ్వు నవ్వింది. లోపలికి వెళ్లింది. ఫ్లాస్కులో వున్న కాఫీని కప్పులో పోసి తెచ్చి మావగారికి అందించింది.

''ఈ మధ్య రాస్తున్నారు మావయ్యా!'' అంది.

''ఏవిటి? రావుకోటా?'' అడిగాడు శివానందం.

''ఏడుపుగొట్టు కథలు! అంటే విషాద కథలు''

''ఎవరి ఏడుపు గురించి రాస్తున్నాడో?''

''వచ్చేక ఆయన్నే అడగండి!''

''వాడ్నా? వాడో బెల్లం కొట్టిన రాయి! దేనికీ జవాబు చెప్పడు. గట్టిగా నిలేస్తే పైకప్పుకేసి గుడ్లు మిటకరించి చూస్తాడు!''

సుబ్బలక్ష్మి గట్టిగా నవ్వింది.

''చిన్నతనంనుండి అది ఆయన అలవాటని నాకేం తెలుసు మావయ్యా! సరేగానీండి, వారం రోజులనాడు అత్తయ్యపేర ఓ ఇన్‌లాండ్ కవర్రాసేను. అందలేదా?'' అడిగింది.

''ఎందుకందదు? మూడోనాడే అందింది. రమ్మని రాశావు మీ అత్తయ్యనీ, నన్నూ! మీ అత్తయ్య వెర్రి పీరు. మురిసి ముప్పందువైపోయింది. కనీసం ముప్ఫై మంది ముత్తయిదువులకైనా చెప్పి, వాళ్ల బుర్రలు వాయగొట్టేసింది. ఆ తాగుబోతు వెధవకి బుద్ధుండొద్దూ! సిగ్గుతో తల దించుకోడం మానేసి తనకేదో ప్రఖ్యాతి వచ్చేసిందని పొంగిపోయాట్ట! మీదుమిక్కిలి వంద పేపర్లుకొని, కనపడ్డవాళ్లందరికీ పంచిపెట్టి నా కీర్తి ప్రతిష్ఠలకి ఆనందించండోయ్' అన్నాట్ట! అలా వుంది మీ అత్తయ్యవరస!'' అన్నాడు శివానందం పడీ పడీ నవ్వుతూ.

''నేను రమ్మని రాయటం యాక్సిడెంటల్ కాదు మావయ్యా!'' అంది సుబ్బలక్ష్మి.

''నాకు తెలుసమ్మా! నేనన్నది అదికాదు. కొడుకు సన్నాసి రాయలేదన్న బాధలేదు దానికి. నువ్వా మాట రాసినందుకు మహా సంతోషపడిపోయిందంటున్నా. ఓ మాట చెప్పు తల్లీ! మీ అత్తతో మాట్లాడాల్సిన రహస్యం ఏవిటమ్మా?''

''ప్యూర్లీ పర్సనల్!''

''గొప్ప చిక్కే తెచ్చి పెట్టేవే! అదేదో తెలుసుకుందామని నేను బయల్దేరాను. ఆ బుల్డోజర్ని కూచోబెడితే ఆ బస్సెక్కడ కర్ణరథంలా భూమిలోకి కుంగిపోతుందోనని భయపడ్డాను సుమీ!''

''మీరు మరీను మావయ్యా! అత్తయ్య అంత భారీ మనిషి కాదని మీకు మాత్రం తెలీదేవిటి?''

శివానందం సన్నగా నవ్వి ''అక్కడికీ చెవిన ఇల్లు కట్టుకుని చెప్పానమ్మా! మావయ్యకి కుదరకపోతే మీరైనా తప్పక రండి'' అని సుబ్బులు మరీ మరీ రాసిందే, బస్సెక్కిస్తాను, ఓ వారం వెళ్లిరావే అన్నాను. వింటేనా? దొంగబాధకన్నా లింగబాధ ఎక్కువని బస్సు కుదుపులన్నా భరిస్తానుగాని, వాంతులబాధ నే భరించలేనని భీష్మించుక్కూచ్చుంది. పైగా విషయమేమిటో కనుక్కురమ్మని నన్ను తరిమింది. పోనీ ఓ పని చెయ్యి! దానితో ఏం చెప్పదల్చుకున్నావో ఓ కాగితంమీద రాసి, కవర్లో పెట్టి అంటించివ్వు. భద్రంగా చేరవేస్తా! సరేనా?'' అన్నాడు.

సుబ్బలక్ష్మి తనలో తనే నవ్వుకుంటూ శివానందం ఖాళీచేసిన కప్పు తీసుకుని వంటింట్లోకి వెళ్లింది.

★ ★ ★

గొల్లు నవ్వేడు చలపతి.

''భార్యలు భర్తలను ప్రేమించవలెను'' చేతిలో వున్న వీక్లీలోకి చూస్తూ గట్టిగా పైకి చదివాడు.

''టైటిల్ గొప్ప నోవెల్గా వుందిరా చలపాయ్! మన రామ్మూర్తిగాడి మొదటికథ బాగా అమ్ముడయ్యే వీక్లీలో అచ్చువడం మరీ గొప్ప! ఏవంటావ్?'' అడిగాడు జగన్నాథం.

చలపతి ఓ సిగరెట్టు ముట్టించాడు. గట్టిగా రెండు దమ్ములాగి గాలిలోకి వదిలాడు.

''అనేసిందేదో అనేసి, మళ్లీ నన్నడగడం దేనికిరా వెర్రి నా జగ్గూ! నీకంత నచ్చింది కనుక, చిన్న సైజు పార్టీ ఎరేంజి చేసి, రెండు పెగ్గులు కొట్టించరా! అసలే ఈ నెలంతా బొత్తిగా పొడిపొడిగా వుంది!'' అన్నాడు.

''నేనా? కాండూరి లక్ష్మీపతిగాణ్ని! నేను కొట్టించడమేంటి? కథ రాసింది వాడు! అచ్చయింది వాడి పేరుమీద! రేపో మాపో రెమ్యునరేషన్కింద వందో నూట యాభయ్యో వస్తే పుచ్చుకునేది వాడు. మొదటి కథా, మజాకానా? నీ సంగతి నాకు తెలీదు. నేను మాత్రం వాణ్ణి వదల్ను!'' అన్నాడు జగన్నాథం.

''రామ్మూర్తిగాడు పార్టీ ఇవ్వడుగాక ఇవ్వడు!'' అన్నాడు చలపతి.

''ఏం ఎందుకని?'' అడిగాడు జగన్నాథం.

''వాడు ప్రస్తుతం మానసిక సంక్షోభంతో కుంగిపోతున్నాడ్రా!''

''నీతో చెప్పాడా?''


''ఈ కథ చదివేనో లేదో నాకర్థమైపోయింది''

''అంటే... ఇది వాడి ఆత్మకథ అంటావా?''

''చదవరా, తెలుస్తుంది!''

''చదివేన్లేరా! అయినా నాకు బోధపడి చావలా! నేను నీ అంత తెలివిగలవాణ్నయి వుంటే మీరూ, మీరురాసినవి చదివి, బాగుంటే నా చంకలు నేనే ఎందుకు గుద్దుకుంటాను? ఈ పాటికి ఓ కార్ఖానా పెట్టేసి వీర లెవెల్లో కథల ఉత్పత్తి చేస్తూ వుండేవాణ్ణి. అదంతా ఒద్దిప్పుడు. నువ్వెలా కనిపెట్టేవో చెప్పు ముందు?''

చలపతి సమాధానం చెప్పకుండా శూన్యంలో పొగమేఘాలూ, వాటిల్లో రింగులూ సృష్టిస్తూ ఊరుకున్నాడు. జగన్నాథం ఇబ్బందిగా కుర్చీలో అటూ ఇటూ పోశ్చర్స్ మార్చుకుంటున్నాడు.



''ఇదెక్కడి దరిద్రగొట్టు కుర్చీరా బాబూ! వందన్నర కథలు అచ్చేసుకున్న వెధవ్వి! కాస్త మంచి కుర్చీ కొనుక్కుని తగలడ్రాదూ?'' అని కసురుకున్నాడు.

''కూర్చోడం చాతగాదని ఏడిస్తే బావుంటుందిరా జగ్గూ! ఆ కుర్చీని సల్లెత్తు మాట అనకు! పొరపాట్న అన్నావే అనుకో! ఆ మాట మా ఆవిడ చెవినబడితే, అది నిర్మొహమాటంగా నీ మొహాన చిక్కని పేడనీళ్లు కొడుతుంది!'' అన్నాడు చలపతి సీరియస్‌గా.

''ఈ నీచ నికృష్ట దరిద్ర దామోదర కుర్చీకీ, పేడనీళ్లకి వున్న అవినాభావ సంబంధం ఏమిటని?'' అడిగాడు జగన్నాథం.

''పవిత్రాతి పవిత్రమైన సెంటిమెంటు బంధంరా అది! నీలాంటి అర్భకుడికెలా అర్థమవుతుంది? ఆ కుర్చీకి ఒక మహత్తర చరిత్ర వుంది. తన ఏకైక పుత్రికపైగల అపారమైన ప్రేమ చిహ్నంగా మా మావగారు మా వివాహ శుభసందర్భాన ఇచ్చి మాట నిలబెట్టుకొనుటకై పంపిన గృహోపకరణములలోనొక్కటి. పూర్తిగా ఇండిజినస్! అంతే వాళ్ల ఊళ్లో బహుకాలంగా స్థిరపడ్డ ప్రఖ్యాత పనివాడి సృష్టి. అక్కడే దొరికిన బంగారు చెక్కతో చేసిన కుర్చీ. నిజం చెప్పాలంటే మా ఆవిడ నాకంటే ఎక్కువ ప్రేమించే కుర్చీ!''

''అంతా బాగానే వుంది! కాని చెక్కలో బంగారుచెక్క, వెండిచెక్క, ఇత్తడి చెక్క, ఇనుప చెక్క... ఈ లోహ విశేషణాలేమిటో అర్థంగాలా!''

''సందర్భాన్నిబట్టి విలువలు మారతయ్యిరా! ఉదాహరణకి నీకేదో పీక తెగిపోయే అవసరం వచ్చింది. మరేం కాదురా! నీ గర్ల్‌ఫ్రెండ్ సినిమాకి తీసుకెళ్లమంది. నెలాఖరు. జేబులో ముప్పై ఉన్నాయి. దర్జాగా వెళ్లారు. వెళ్లేసరికి బుక్కింగ్ క్లోజ్డ్. బ్లాకులో బాక్స్ టిక్కెట్టు ఖరీదు పద్దెనిమిది. ఉన్నవి రెండే టిక్కెట్లు. పదహారుకిస్తానంటాడు. ముప్పైరెండుకి నీ దగ్గర రెండు తక్కువ! పోతే పోనీ తీసుకో జగ్గూ అంటుంది గర్ల్‌ఫ్రెండ్ మధురంగా! ఆఫ్టరాల్ రెండురూపాయలు! కానీ నీ దగ్గర లేవు. అప్పుడా రెండు రూపాయల విలువెంతుంటుందిరా? నీ ప్రేమంత! నీ ప్రిస్టేజ్, డిగ్నిటీ... ఎట్సిట్రా అంతా! ఒప్పుకుంటావా?''

జగన్నాథం తన బుర్ర పట్టుక్కూచున్నాడు.

''అన్నట్టు ప్రేమంటే గుర్తొచ్చింది. మన రామ్మూర్తి తన పెళ్లాన్ని గాఢాతిగాఢంగా ప్రేమించాట్ట!'' అన్నాడు చలపతి.

''మూతి పగిలిపోతుందిరా చలపాయ్! ఇందాకట్నుంచి చూస్తున్నాను, నోటికొచ్చినట్టు వాగుతున్నావ్! అడ్డమైన పువ్వులూ పెట్టించుకోడానికి! రామ్మూర్తిగాడు తన పెళ్లాన్ని ప్రేమించడం ప్రపంచ వింతలా చెబుతావేంటి? అసలు రామ్మూర్తిగాడేకాదు, ఈ ఆంధ్రావనిలో, కాదు, యావద్భారతావనిలో, భర్తనేవాడు భార్యని ప్రేమించకుండా వుండడు. భర్తలందరికీ భార్యల్ని ప్రేమించే హక్కూ, అధికారం వున్నాయి. ఆ మాటకొస్తే ఆ హక్కులూ, అధికారాలూ భర్తలకు సంక్రమించిన తరతరాల వారసత్వసంపదలు!'' వాదనకి దిగేడు జగన్నాథం.

''అది నిజమే అనుకో! కాని ఇక్కడో చిన్న చిక్కొచ్చి పడుతోందే! వెనకటికెవరో మానసిక శాస్త్రజ్ఞుడు అన్నాడట! భర్త అనేవాడు తన భార్యగురించి పిల్లల్ని ప్రేమిస్తాడు. భార్య తన పిల్లలకోసం భర్తని ప్రేమిస్తుందీ - అని!'' చెప్పాడు చలపతి.

''ప్రస్తుతం మన రామ్మూర్తికి పిల్లా పీచూ లేరు. కనక వాడు వాడి పెళ్లాం పరస్పరం ప్రగాఢాతి ప్రగాఢంగా ప్రేమించుకుంటూ వుండాలే!''

''నిజమే కాని, మన వాడు మాత్రం

సుబ్బలక్ష్మిని మహా ఇదిగా ప్రేమిస్తున్నాడు''

''పిల్లలు లేరు గనుక సుబ్బలక్ష్మి వీణ్ణి ప్రేమించడం లేదంటావా?''

''అని నేనన్లేదు! రావమ్మూర్తే స్వయంగా చెప్పాడు. ఆమె హృదయపీఠంలో తనస్థానం అంత సుస్థిరంగా లేదేమోనని వాడి శంక!''

''ఇదెక్కడి మూలశంకరా తండ్రీ! కారణం అడిగావా?''

''కాలం కలసిరాలా!''

''అదేం పోయేకాలం?''

''అడక్కుండానే తెలుసుకుందామని! దకేసీజ్ అండర్ సీరియస్ ఇన్వెస్టిగేషన్!'' పైకప్పుకేసి చూస్తున్నాడు చలపతి.

జగన్నాథం మళ్లీ బుర్ర రెండు చేతుల్తో పట్టుకు్కూచున్నాడు.

★ ★ ★

మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. సుపుత్రుడికోసం చూసీ, చూసీ శివానందానికి విసుగొచ్చేసింది. ఆకలికి కడుపులో పేగులు ఉండలు చుట్టుకుపోతున్నాయి. గుమ్మంలోనే నిల్చుని వీధివైపు రెప్ప వాల్చకుండా చూస్తున్న సుబ్బలక్ష్మినే పరిశీలిస్తున్నాడు. చాలాసేపటికి సుబ్బలక్ష్మి గుమ్మం వదిలి, ''రండి మావయ్యా, మీకు వడ్డించేస్తాను. వీధిలో కాలుపెడితే మీ అబ్బాయికి ఇల్లూ, ఇల్లాలూ గుర్తుండరు'' అంటూ వంటింట్లోకి వెళ్లింది. వడ్డించి పిలిచింది. శివానందం వెళ్లి కూర్చున్నాడు.

''నువ్వూ వడ్డించుకోకపోయావా సుబ్బులూ?'' అన్నాడు.

సుబ్బలక్ష్మి భారంగా నిట్టూర్చి ''నాకు ఆకల్లేదు మావయ్యా! ఆయనొచ్చాక ఇద్దరం కలిసే కూచుంటాం! వారానికో ఆదివారం. కనీసం ఇవ్వాళైనా ఇద్దరం కలిసి...'' అంటూ చప్పున నాలిక కరుచుకుంది.

''అంటే... రెండు వీధుల అవతలున్న ఆఫీసునుంచి మధ్యాహ్నం లంచవర్లోకూడా భోజనానికి రావడంలేదా వీడు? ఏవిటి వీడికున్న రాచకార్యాలు? ఇప్పుడంటే రిటైరైపోయాగాని, ముప్ఫై మూడేళ్లు నేనూ వెలగబెట్టాను ఉద్యోగం! లంచవర్లో రెండున్నర కిలోమీటర్లు డొక్కు సైకిలు తొక్కుకుంటూ వెళ్లి మీ అత్త మొహం చూస్తూ కూచుంటేగాని ముద్ద దిగేదికాదు'' అన్నాడు శివానందం.

## మొఖం

''మీరు మొదటిసారిగా సిగ్గుపడుతూ నటించారట ఎందుకు?'' అడిగాడు పత్రికా విలేకరి సెక్సీశ్రీని.

''అందులో మొదటిసారిగా నా మొఖం చూపించాను'' అంది తక్కున.

- జి. వాసు (ఖమ్మం)



''ఆఫీసు పనెక్కువగా వుందిట మావయ్యా! మధ్యాహ్నం రావడానికి కుదరదని ఉదయమే తినేసి వెడుతున్నారు. ఆరు నెల్లనుంచి!'' అంది సుబ్బులక్ష్మి. ఆమె మొహం చూస్తుంటే మళ్లీ ప్రశ్న వెయ్యాలనిపించలేదు శివానందానికి.

''బంగాళాదుంపల కూర అద్భుతంగా చేశావమ్మా! ఈసారి మీ అత్తొచ్చినప్పుడు కాస్త దానిక్కూడా నేర్పుతల్లీ బతికిపోతాను. ఎప్పుడు చేసినా బండెడు పచ్చిమిర్చి నూరి పడేస్తుంది - నాలిక ఊడిపడేటంత కారం! చిత్రహింస అనుభవిస్తున్నాననుకో!'' అన్నాడు శివానందం, మాట మార్చేస్తూ.

''అత్తయ్య అడిగిందేదో కొనిపెట్టి వుండరు. అందుకే మీమీద కోపం వచ్చి వుంటుంది'' అంది సుబ్బులక్ష్మి నవ్వి.

''దానిమొహం! దానికి కోపం ఏమిటమ్మా? నన్ను మా బాస్ అప్పుడప్పుడు చిత్రిక పడుతుంటాడని, నా ఫ్రెండ్ మాటవరసకి అంటేనే భరించలేక ఏడుస్తూ కూర్చునేది. ఏవిటో నేనంటే దానికంత వల్లమాలిన ప్రేమ!'' అన్నాడు శివానందం, పాతజ్ఞాపకాలు నెమరువేసుకుంటూ.

''అత్తయ్య ఆ మాట మీతో ఎప్పుడన్నా అన్నారా మావయ్యా!'' అడిగింది సుబ్బులక్ష్మి ఆత్రంగా.

''ఏ మాటమ్మా?'' అడిగాడు శివానందం అర్థంగాక.

''అదే మామయ్యా! మీరంటే వల్లమాలిన ప్రేమని!'' అని చటుక్కున అడిగి సిగ్గుతో తల పక్కకి తిప్పుకుంది సుబ్బులక్ష్మి.

శివానందం పగలబడి నవ్వేడు. నవ్వీ నవ్వీ మెతుకులు గొంతుకు అడ్డంబడి ఉక్కిరిబిక్కిరయ్యాడు. కాసిని నీళ్లుతాగి తేరుకుని ''ఇది సినిమా కాదు తల్లీ అలా బరితెగించేసి వాక్కోడానికి. మనం మామూలు మనుషులం. గుండెల్లో దాచుకోవాల్సిన భావాన్ని అక్కడే భద్రంగా దాచుకుంటాం. అందునా ఆడది మరీను. సిగ్గుతెరలు తీసేయకపోవడం ఆడదానికి అందమమ్మా! నోటికి హద్దుండకపోవచ్చు! కాని మనసలా కాదు. మూగది. స్పందించడం తెలుసుకాని చెప్పడం దానివల్లకాదు. ముఖ్యంగా స్త్రీల విషయంలో ఇది పచ్చినిజం!'' అన్నాడు శివానందం.

''ఈ నిజం మీ అబ్బాయికి తెలీకపోవడమేమిటి మామయ్యా?'' అనడిగింది సుబ్బులక్ష్మి.

ఉలిక్కిపడ్డాడు శివానందం. ఆయనగారి బుర్ర కంప్యూటర్‌కన్నా వేగంగా ఆలోచిస్తోంది. అవును. ఇక్కడేదో చిన్న సైజు తుఫాను మొదలైంది. ప్రారంభదశలోనే వున్నదింకా. మొదట్నుంచీ కలల్లో పడి గిలగిల కొట్టుకోడం అలవాటైన తన కొడుకు సన్నాసి, వాస్తవంలోకి రాలేక సుబ్బుల్ని బాధపెడుతూ, తనూ విలవిల్లాడుతూ వుండి వుంటాడు. సరైన ప్రికాషనరీ మెజర్స్ తీసుకోకపోతే పెనుతుపానయిపోయి వీళ్లిద్దర్నీ చెరోవైపుకీ గిరాటుకొట్టే ప్రమాదం పొంచి చూస్తోంది అనుకున్నాడు. మార్గాన్వేషణ మొదలెట్టాడు శివానందం.

రెండున్నరకి బట్టలేసుకుని బయలుదేరాడు వీధిలోకి.

''ఎండ మామయ్యా!'' అంది సుబ్బులక్ష్మి. తిండి తిప్పలు మానేసి మొగుడికోసం నిరీక్షించడంలో ఆమె ఎండిపోయిన తోటకూర కాడలా వాడిపోయింది. శివానందంకి జాలేసింది.

''సుబ్బులూ! నా మాట విని కాస్త ఎంగిలి పడమ్మా! ఆ వెధవ ఏదో హోటల్లో ఫ్రెండుగాళ్లతో కలిసి మెకంలా పీకలదాకా మెక్కేసుంటాడు. నానాగడ్డీ

కతికినవాడికి పెళ్లాం ఆకలేం తెలుస్తుంది? ఈ పాతివ్రత్యానికి ఫుల్‌స్టాప్ పెట్టి భోంచేసెయ్యి తల్లీ!'' అన్నాడు.

''ఆకలి చచ్చిపోయిందిలెండి మామయ్యా!'' అంది సుబ్బలక్ష్మి.

శివానందం నిట్టూరుస్తూ గుమ్మం దిగేడు. సరాసరి చలపతి ఇంటికి వెళ్లాడు. ఆయున్ని చూడగానే చలపతి సాదరంగా ఆహ్వానించాడు.

''చాల్లేరా చలపాయ్‌, నీ దిక్కుమాలిన మర్యాదలు! రోము తగలడుతుంటే నీరో చక్రవర్తిగాడు పిడేలు వాయించుకుంటూ కూచున్నాట్టు!'' అన్నాడు శివానందం కోపంగా.

చలపతి నవ్వి ''పిన్ని ఇవ్వాళ గొడ్డుకారం వేసిపెట్టినట్టుంది బాబాయ్! మాంచి హీట్‌లో వున్నావ్! ఇంతకీ నువ్వెప్పుడొచ్చావ్?'' అని ప్రశ్నించాడు.

''ఎప్పుడేడిస్తే ఏంగాని, ముందీ సంగతి చెప్పు! మావాడు ఏడి? పొద్దుట తొమ్మిదింటికి వెళ్లి ఇప్పటిదాకా రాలేదు. పాపం మా కోడలేమో వాడి కోసం తిండి మానేసి కూచుంది. ఏవిట్రా వాడిని ఇలా తయారుచేశావు?'' అన్నాడు శివానందం.

''నేను తయారు చేయడం ఏమిటి బాబాయ్? నామీద కసుంటే ఆ గొడుగట్టుకుని రెండు పోట్లు పొడువు. అంతేగాని నా గుండెని తూట్లు చెయ్యకు. చూడు బాబాయ్! మెన్ క్రియేట్ సిచుయేషన్స్! సమ్ సిచుయేషన్స్ మేక్ మెన్ అన్నారెవరో! ఇదంతా రామ్మూర్తి స్వయంకృతం! ఎవడేం చేస్తాడు? వాడేమన్నా గోధుంపిండి ముద్దా, ఇష్టం వచ్చిన షేపుల్లో చపాతీలొత్తడానికి? చదువుకున్నాడు, బుర్రున్నవాడు ఉద్యోగం చేస్తున్నాడు. కోరి చేసుకున్న భార్యగల భాగ్యశాలి!'' అన్నాడు చలపతి.

''మరేవిటి వీడి వికారాలు?'' అడిగాడు శివానందం మిక్కిలి అయోమయంగా.

''వికారమో, నిరాకారమో అదలా వుంచు! వాణ్ణి లూప్‌లైన్‌లోంచి మెయిన్‌లైన్లో పెట్టడం ఎలాగో ఆలోచించాలి. అదుగో మా ఆవిడ పక్కింటి పెత్తనాలు ముగించుకుని, సొంతింటి పెత్తనానికి తరలివస్తోంది. కాసిని టీనీళ్లు పోసుకుని ఆనక ఇద్దరం జుట్టు పీక్కుందాం బాబాయ్!'' అన్నాడు చలపతి.

''పీక్కుందామన్నా నాకెక్కడుందిరా? ఏనాడో బుర్ర గుండ్రాయిలా తయారైపోయింది!'' అని

## ఆరోగ్యంకోసం



తమిళనాడులోని మధురై జిల్లాలో ఉన్న పెరిమాయూర్‌లో ఓ తెగ ప్రజలకు ఓ తమాషా అలవాటు వుంది. అయిదేళ్లకోసారి ఓ పెద్ద గుంటతీసి పిల్లలను అందులో కొన్ని నిమిషాలు పాతిపెడ్తారట! ఓ ప్రీస్ట్ పిల్లల్ని పాతి పెట్టేముందు వారిమీద పవిత్ర జలం చల్లితే వారు స్పృహతప్పుతారట! తర్వాత వారిని బయటకు తీసి మళ్లీ పవిత్ర జలం చల్లితే స్పృహలోకి వస్తారట - వారికి ఉన్న జబ్బులన్నీ ఇలా చేస్తే మటుమాయం అవుతాయని వారి నమ్మకం - ఈ సంవత్సరం ఆగస్టులో ఇలా 150మంది పిల్లల్ని పాతిపెట్టామని వారు చెప్తున్నారు. నిజంగా ఇది అనాగరికంగా కనిపిస్తున్నా... భూమిలో పాతిపెట్టిన పిల్లలు సురక్షితంగా బయటకు రావడం విశేషమే!

- జూపిటర్

ఎప్పుడు శవానందం. చలపతి శ్రుతికలిపేడు.

★ ★ ★

పక్కింటి గం. భా. స ఆదిలక్ష్మమ్మగారు అందించిన ఇంటి తాళాలు అందుకుని, ''సుబ్బలక్ష్మి ఎక్కడికి వెళ్లింది పెద్దమ్మగారూ?'' అని ప్రశ్నించేడు రామ్మూర్తి.

''తెలీదు నాయనా! నువ్వొస్తే తాళం చెవులిమ్మంది. చేతిలో సూట్‌కేసుంది మరి! పుట్టింటికేమన్నా వెళ్లిందేమో! మీ పరిస్థితి చూస్తుంటే వింతగా వుందిరా తండ్రీ! నువ్వెక్కడికెడుతున్నావో దానికి చెప్పవు! అదెక్కడికెడుతుందో నీకు చెప్పదు! బాగుంది! చాలా బాగుందిరా అబ్బీ!'' అన్నదావిడ.

రామ్మూర్తి ఇంట్లోకి వెళ్లాడు. నట్టింట్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తూ ఓ కవరు పడుంది. స్కెచ్‌పెన్నుతో రాసిన పెద్ద పెద్ద అక్షరాలు ఆకుపచ్చ రంగులో మెరుస్తున్నాయి - ''శ్రీశ్రీశ్రీ రామ్మూర్తిగారికి'' అని.

ఆత్రంగా కవరు విప్పేడు రామ్మూర్తి. లోపలున్న ఉత్తరం చదువుకోసాగేడు.

''శ్రీవారి కఠినాతి కఠినమైన ఇనప పాదపద్మములకు శతసహస్రవందనాలతో, మీ చరణదాసి వ్రాసుకొను సంక్షిప్త విన్నపములు అవధరింపగోరుచున్నాను. మిమ్ములను మనసా, వాచా, కర్మణా మహా గాఢముగా ప్రేమించి, మీరే నా సర్వస్వమ్మని నమ్మి, మీతో జీవితమును పంచుకొంటిని. సంతోష సముద్రమున ఓలలాడగలనని విశ్వసించి బతుకుచుంటిని. మీరు నన్ను, నా మనసును అండర్‌స్టాండ్ చేసుకొనలేక, ప్రతిక్షణము నన్ను నువ్వు నిజంగా ప్రేమించావా లేదా? ప్రేమిస్తున్నావా లేదా? అని అనుమానముతో అడుగుచూ, ప్రేమించాను ప్రేమించాను అని రామకోటి వ్రాసినట్లును, రామనామము జపించినట్లును చెప్పింపవలెనని తలంపుతో నిత్యమూ ప్రయత్నములు సాగించుచున్నారు. ఈ లోకమున ఏ భార్యలైనను, మొగుడుగారు కనిపించిన ప్రతిసారీ పిచ్చెక్కినవారివలె 'నేను మిమ్ములను ప్రేమించుచున్నాను ప్రాణేశ్వరా' అని అందురా? ఒక్కరిని చూపింపుడు! వెండితెరపై మాత్రమే అట్టి డైలాగులు వినిపించును. నిజజీవితమున అట్లు చెప్పుట సిగ్గుమాలినతనమని మా బామ్మ గతములో చెప్పియున్నది. మనసులో ప్రేమయున్నప్పుడు దానిని మాటలతో చెప్పుకొనుట ఏల? ఒకవేళ నేను మీ బాధపడలేక చెప్పితినే అనుకొనుడు! మీకు నమ్మకము పుట్టునని నమ్మకమేమి? ఫొక్టు చెప్పవలెనన్న మీరొట్టి నిత్యశంకితులు. మీతో నా కాపురము బహుకష్టము. కావుననే నేనిటువంటి నిర్ణయమునకు వచ్చితిని. ముందుగా నా మెట్టినింటికేగి, అత్తమామలకు నమస్కరించి, తదనంతరము పుట్టింటికేగెదను. వారు నన్నాదరింపక గెంటివేసినచో, విశాఖపట్నంలోని బంగాళాఖాతమున మునిగిపోయి బతుకు ముగించుకొందును. తరువాత అందులో ఒక కెరటముగా మారి, మీరెప్పుడైనను బీచికి వత్తురేమోనని నిరీక్షించి మీరొచ్చినప్పుడు మీ కఠిన పాదములను తాకి మురికిని వదలగొట్టెదను. ఈ పాటి సేవచేయుటకైనను మీరు అనుమతింపగలరని ఆశించుచూ, సెలవు తీసుకొను మీ పాదదాసి, సుబ్బలక్ష్మి''

రామ్మూర్తి హృదయము కదిలిపోయింది. అక్షరరూపంలో కనిపించిన సుబ్బలక్ష్మి ప్రేమైక హృదయం అతన్ని సంతోషంలో ముంచి తేల్చింది. అయినా ఉత్తరం మామూలుగా రాయకుండా ఆ భారత రామాయణాల భాషేమిటి మరీ ఘోరంగా అనిపించింది. తననింత గాఢంగా ప్రేమించిన భార్యనిన్నాళ్లు చిత్రహింస పెట్టినందుకు తనకి తనే బూతులు తిట్టుకున్నాడు. వెంటనే వెళ్లి

సుబ్బులక్ష్మిని రక్షించుకోవాలి - బంగాళాఖాతంలో పడకుండా! ఎలాగైనా దక్కించుకోవాలి.

తనసలు హైదరాబాదు వెళ్లకుండా వుండాల్సింది - ఇంత ఘోరం జరక్కపోను - అనుకున్నాడు. వెళ్లకపోతే తన ప్రేమని ఇంత ఘాటు భాషలో ఉత్తరంద్వారా తెలియజేసే అవకాశం సుబ్బులక్ష్మికి రాదు - అనుకున్నాడు.

అంతలోనే 'బంగాళాఖాతం, సుబ్బులక్ష్మి' అంటూ లోపల్నుంచి అంతరాత్మ గద్దించడం మొదలుపెట్టేసరికి, రామ్మూర్తి వణికే చేతుల్తో కొంపకి తాళం పెట్టి బైటపడ్డాడు. తాళం చెవులు గం. భా. స ఆదిలక్ష్మమ్మగారికి ఇచ్చి ''మా సుబ్బుల్ని తీసుకురావడానికి వెళుతున్నా పెద్దమ్మా!'' అని చెప్పి రోడ్డుమీదికొచ్చి ఆటో ఎక్కాడు బస్టాండ్ చేరాలని.

★ ★ ★

సుబ్బులక్ష్మి అంతకుముందురోజే మెట్టినిల్లు వదిలి పుట్టింటికి వెళ్లినట్లు చెప్పాడు శివానందం.


''హాయిగా వుండరా సన్నాసీ అని బంగారంలాంటి పిల్లని కట్టబెట్టాను. నీ వికారాలతో, దరిద్రగొట్టు ఆలోచనలతో దాని మనస్సు విరిచేశావ్! కర్రలు విరిగిపోతే ఫెవికాలో మరో కాలో పెట్టి అంటించొచ్చు. మనసు విరిగితే అతికించడానికి కాళ్లూ లేవు చేతులూ లేవు. అయినా నా బుద్ధి తక్కువ కాకపోతే, సుఖపడే యోగం లేని నీకు పెళ్లి చేయడమేమిట్రా నేను? అది ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే, ఆ పాపం నీకన్నా నేనే ఎక్కువ మూటకట్టుకోవాల్రా, నిన్ను కన్నందుకు!'' అని వాయించేశాడు కొడుకుని.

''చచ్చిన పాముని చంపుతావేమిటి నాన్నా!'' అన్నాడు రామ్మూర్తి ఏడుపుమొహంతో.

''వెంటనే మల్లాయపాలెం వెళ్లరా రావుడూ! వెళ్లి సుబ్బులక్ష్మిని దక్కించుకోరా! దాని మాటలు వింటే, అది ఏదో ఘోరం చేసుకోడానికి సిద్ధపడ్డట్టే తోచింది నాకు'' అన్నది తాయారమ్మ కొడుకుతో.

రెండు గుక్కలు కాఫీ గొంతులో పోసుకుని, రామ్మూర్తి బయల్దేరాడు మళ్లీ. ముందు రైలు, ఆ తరువాత బస్సు, ఆ పిదప రిక్షా, అది దిగాక లాంచిలో అంచెలంచెలుగా ప్రయాణం సాగించి మల్లాయపాలెం చేరుకునేసరికి అత్తగారు, మావగారూ దిగాలుగా వాకిట్లో కూచుని దిక్కులు చూస్తున్నారు. మసక చీకట్లు కమ్ముకుంటున్నాయి.

అతణ్ణి చూడగానే వాళ్లిద్దరూ కళ్లనీళ్ల



పెట్టుకున్నారు. ఎక్కణ్ణుంచో వచ్చిన మరదళ్లిద్దరూ ఘొల్లుమన్నారు.

రామ్మూర్తికి పైప్రాణాలు పైనే పోయినట్లయింది.

''సుబ్బులేది మావయ్యా?'' అనడిగాడు బొంగురు గొంతుతో.

''ఎందుకు అడుగుతావు నాయనా! నిన్న సాయంత్రం వచ్చిన దగ్గర్నుండీ ఒకటే ఏడుపు. నిద్రాహారాలు మానేసింది. కంటికి మంటికీ ఏకధారగా కన్నీళ్ళు! మేమూ అదీ ఏం పాపం చేసుకున్నామని బాబూ మాకీ శిక్ష? చీకటిలో లేచి వెళ్లిపోతానంటే మేమే బలవంతాన ఆపేం. 'నాకింకా బంగాళాఖాతమే దిక్కు!' అంటూ రాత్రంతా ఒకటే కలవరింతలు'' అంది అత్తగారు.

''పొద్దుట మేమంతా ముందు గదిలో వుండగా చూసి, బాత్‌రూంలోకి వెళ్లి కిరసనాయిలు ఒంటినిండా పోసుకుని డబ్బా ఖాళీ చేసింది. నీ మరదళ్లు అగ్గిపెట్టె అందనివ్వలేదు గనుక సరిపోయింది. లేకపోతే ఈ పాటికి సుబ్బలక్ష్మి...'' అంటూ ఆగిపోయేడు అర్థవంతంగా.

''సుబ్బులు ఎక్కడుందర్రా?'' అడిగాడు రామ్మూర్తి మరదళ్లవైపు చూస్తూ.

''గదిలో వుంది!'' అన్నారిద్దరూ ముక్తకంఠంతో.

లోపలికి పరిగెత్తాడు రామ్మూర్తి. ఓరగా వేసివున్న తలుపులు తీసి లోపలికి అడుగుపెట్టాడు. మంచంమీద కూర్చుని కాఫీ తాగుతోంది సుబ్బలక్ష్మి. తెల్లటి వాయిల్ చీర, తలనిండా మల్లెపూలు, కమ్మని సెంటు పరిమళం రామ్మూర్తిని నిర్ఘాంతపరిచాయి. క్షణంలో తేరుకున్నాడు. భర్తని చూసి, ఖాళీ కప్పు కిందపెట్టి లేచింది సుబ్బలక్ష్మి. రామ్మూర్తి వెళ్లి ఆమెని బలంగా కౌగిలించుకున్నాడు.

''సుబ్బులూ ఏమిటిదంతా?'' అనడిగాడు ఆమె చెవిలో.

''ఊహల్లో విహరించే మొగుణ్ణి కిందికి తెచ్చి మామూలు మొగుణ్ణి చేసుకోవడానికి ఇచ్చిన చిన్న షాక్ ట్రీట్‌మెంటు! మీకు నామీదున్న ప్రేమెంతో తెలుసుకున్నాను. ఇప్పుడు చెప్పమంటారా - నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానో లేదో?'' అన్నది సుబ్బలక్ష్మి అతని కౌగిట్లో కరిగిపోతూ.

''వద్దు! నీ గుండె గుసగుసలు చెప్పేశాయి సుబ్బులూ!'' అన్నాడు రామ్మూర్తి, ఆమెతోపాటు మంచంమీద వాలుతూ.

''బావగారూ అసుర సందెవేళ! రావణ కుంభకర్ణులు పుట్టుకొస్తారేమో జాగర్త!'' అంది పెద్ద మరదలు గుమ్మంలోంచి. బైటినుంచి గొల్లున నవ్వులు వినిపించాయి. సుబ్బలక్ష్మి సిగ్గుతో రామ్మూర్తి గుండెల్లో మొహం దాచుకుంది.

★ ★ ★

